# చాలా అభివృద్ధి చేశా.. ఇంకా చేసుకుందాం

**అన్ని రకాలుగా సిద్దిపేట అభివృద్ధి**

- రాబోయే రోజుల్లో మరిన్ని పనులు చేసుకుందాం..
- ప్రజలే నా కుటుంబం
- నంగునూరు అంటేనే నాకు నమ్మకం, భరోసా
- రిస్క్ వద్దని చెప్పి ప్రజలతో కారు గుర్తుకే ఓటు వేయించాలి
- తప్పుడు ప్రచారాలను కార్యకర్తలు తిప్పికొట్టాలి
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- నంగునూరు రోడ్ షోలో పాల్గొన్న మంత్రి
- గులాబీమయమైన నంగునూరు


నంగునూరులో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, భారీగా తరలివచ్చిన ప్రజలు

నంగునూరు, నవంబర్ 24: సిద్దిపేట ప్రజలే నా కుటుంబ సభ్యులుగా భావించి.. అన్ని రకాలుగా సిద్దిపేటను అభివృద్ధి చేసుకున్నామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నంగునూరులో మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. నంగునూరు అంటేనే తనకు ఎంతో నమ్మకం, భరోసా అన్నారు. సీఎం కేసీఆర్‌కు సైతం నంగునూరు మండలం కోనాయిపల్లి సెంటిమెంట్ అన్నారు. తెలంగాణలో 24 గంటలు కరెంట్ ఇస్తుంటే కర్ణాటక నుంచి వచ్చిన కాంగ్రెస్ నేత, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అక్కడ 5 గంటలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. తెలంగాణలో రైతు బంధుతో అన్నదాతలకు భరోసా కల్పించామన్నారు. మండలంలో ఎటు చూసినా పచ్చని పంట పొలాలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల తర్వాత పెన్షన్ వచ్చే వారందరికీ రూ.5 వేల పెన్షన్ ఇస్తామన్నారు. కరోనా సమయంలో నా కుటుంబ సభ్యులని భావించే అందరికీ సేవ చేశానని చెప్పారు. సర్కార్ దవాఖానలను బాగు చేసుకున్నామని.. మోకాలి మార్పిడి, డయాలసిస్, ఐసీయూ వంటి సౌకర్యాలు కల్పించుకున్నట్లు తెలిపారు.


రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

### చదువులకు నిలయం సిద్దిపేట

సిద్దిపేట చదువులకు నిలయంగా మారిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అన్ని రకాల చదువులు సిద్దిపేటలో ఉన్నాయన్నారు. రూ.300 కోట్లతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నంగునూరు మండలంలో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. నా కుటుంబ సభ్యులని భావించి అన్ని రకాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రుణమాఫీ 75 శాతం పూర్తయిందని.. ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేసి తీరుతామన్నారు. ఈసారి పేదలందరికీ ఇండ్లు కట్టిచ్చే కార్యక్రమం చేస్తామన్నారు. నాడు పని దొరుకుతలేదు అనే పరిస్థితి ఉండే.. కానీ నేడు కైకిలోల్లు దొరుకుతలేరనే పరిస్థితి వచ్చిందన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. ఆత్మవిశ్వాసంతో ఉండాలి కానీ అతి విశ్వాసంతో ఉండకూడదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే విష ప్రచారాలను కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు. కాంగ్రెస్ వాళ్లు వస్తే మళ్లీ దొంగరాత్రి కరెంట్ వస్తుందని.. రిస్క్ వద్దని మళ్లీ కారుకే ఓటు వేయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ వైస్ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల వాగ్దానాలను నమ్మొద్దు

**రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**


పల్లెపహాడ్‌లో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌అర్బన్, నవంబర్ 24: సీఎం కేసీఆర్‌తోనే మల్లన్నసాగర్ పునరావాసమైన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మరింత అభివృద్ధి చేసుకోవచ్చుని, మోసం చేయడానికే వచ్చే బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వేముల ఘాట్, పల్లెపహాడ్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలతో నాకు చక్కని బంధం ఉన్నది. సీఎం కేసీఆర్‌కు చెప్పి వీలైనంత ఎక్కువ పరిహారం వచ్చేలా చేశానన్నారు. కేసీఆర్‌కు ముంపుగ్రామాల ప్రజలపై ఎంతో ప్రేమ ఉన్నదని, అందుకే గత ప్రభుత్వాలు చేయని విధంగా పరిహారం అందివ్వడంతో పాటు 250గజాల స్థలంలో ఇండ్లు కట్టించారన్నారు. దుబ్బాక ఉప ఎన్నికలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎకరానికి రూ.12లక్షలు ఇప్పిస్తానని హామీ ఇచ్చి మోసం చేశాడని గుర్తు చేశారు. ఇప్పుడు అబద్ధాలతో మోసం చేయడానికి ఈటల రాజేందర్ వస్తున్నాడన్నారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలకు సీఎం కేసీఆర్ అండగా ఉంటారని, ఎవరూ ధైర్యం కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు సిద్దిపేట బాలయ్య, గుగ్లోత్ రజితాగోవింద్, ఉప సర్పంచ్‌లు బాల్‌కిషన్, లలితానాగరాజు, నాయకులు ఎంపీటీసీ మల్లేశం, సీనియర్ నాయకుడు సిద్దిపేట ఎల్లం, మాజీ సర్పంచ్‌లు నగేశ్, నర్సింహారెడ్డి, మల్లేశం, కనకయ్య, మాజీ జడ్పీటీసీ లక్ష్మీరాములు, కొమ్ము నరేశ్, కనకయ్యగౌడ్, డాక్టర్లు జితేందర్, నర్సింలు, నాయకులు కనకయ్యగౌడ్, శివ, ఉమేశ్, కీసరి నరేశ్ పాల్గొన్నారు.


వేములఘాట్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ప్రతాప్‌రెడ్డి

# కాంగ్రెస్ వస్తే మూడు గంటలే కరెంట్

- *గ్యారంటీ లేని పార్టీలను నమ్మితే ఆగమవుతాం.. తస్మాత్ జాగ్రత్త*
- *బీఆర్‌ఎస్ వస్తే మూడు పంటలకు నీళ్లు, 24 గంటల నాణ్యమైన కరెంటు*
- *రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి*
- *రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్*


బెజ్జంకిలో నిర్వహించిన రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు

బెజ్జంకి, నవంబర్ 24: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే మూడు పంటలకు నీళ్లు, 24 గంటల కరెంటు వస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మానకొండూర్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు మద్దతుగా రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారంటీ లేని పార్టీల మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. మూడు గంటల కరెంట్ కావాలా? 24 గంటల నాణ్యమైన కరెంట్, రైతుబంధు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలో ఆలోచించి ఓటు వేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### భారీగా తరలివచ్చిన జనం

బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు మద్దతుగా భారీ సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో రావడంతో మండల కేంద్రం గులాబీమయమైంది. రోడ్ షోలో పాల్గొనేందుకు వచ్చిన వినోద్‌కుమార్, రసమయి బాలకిషన్‌కు డప్పుచప్పుళ్లు, కళాకారుల విన్యాసల మధ్య ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి

# ప్రాణప్రతిష్ఠకు సిద్ధమైన ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం



ప్రాణప్రతిష్ఠకు సిద్ధమైన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 24: భారతదేశంలోనే తొలి అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రతిష్ఠాపనకు సిద్ధమైనట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి వెల్లడించారు. రెడ్‌హిల్స్‌లోని తన కార్యాలయంలో ట్రస్టు సభ్యులు గట్టు రవీందర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శక్తిపీఠాలను దర్శనం చేసుకోవాలనుకునే భక్తులు ఇక నుంచి దేశవ్యాప్తంగా తిరగాల్సిన అవసరం లేదన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక గ్రామ పరిధిలోని ఆనంద నిలయం ఆవరణలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.5.50 కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఆధ్యాత్మిక క్షేత్రంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో అష్టాదశ శక్తి పీఠం ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి సంకల్పించిన దాత గట్టు రాంరాజేశం గుప్తా రూ.5.50 కోట్లు విరాళం ఇవ్వగా, ఇతర దాతల సహకారంతో మరో నాలుగు కోట్లను సమీకరించి ఇటీవల పూర్తి చేశారు. పుష్పగిరి పీఠాధిపతులు అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి, మాధవానంద సరస్వతి శక్తి పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతీ స్వామి పర్యవేక్షణలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి హాజరుకానున్న రుత్వికులు పాల్గొని మూడు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. భారతదేశంలోనే మహిమాన్వితమైన శక్తి పీఠం ప్రారంభోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని రమణాచారి కోరారు.